

జిల్లా కేంద్రంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఇదే




ఎన్‌పీడీసీఎల్ అధికారుల పొలంబాట

- పంట పొలాల్లో అక్కడికక్కడే కరెంటు సమస్యలకు పరిష్కారం
- ఇప్పటికే కొత్త టెక్నాలజీ అమలు
- సమస్యలు లోపాలకు యుద్ధ ప్రాతిపదికన పరిష్కారం
- అరచేతిలో పూర్తి సమాచారం
- ఏఐ ద్వారా కార్యకలాపాలు

నిర్మల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాల్లో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించేందుకు ఎన్‌పీడీసీఎల్ (నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆఫ్ తెలంగాణ) సంస్థ సరికొత్త సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే పొలంబాట పేరిట ఎన్‌పీడీసీఎల్ అధికారులు, సిబ్బంది ప్రతి రోజూ పలు ప్రాంతాల్లోని పంట పొలాలను సందర్శించి అక్కడ వంగినపోల్స్‌ను అలాగే లైన్‌లను సరి చేస్తుండడమే కాకుండా మధ్య స్తంభాలను ఏర్పాటు చేయడం అలాగే తీగ ల మధ్య అవసరమున్న చోట స్పెసర్స్‌ను బిగించడం లాంటి పనులు చేపడుతున్నారు. కొద్దిరోజుల క్రితం నిర్మల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఈ కొత్త కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే నిర్మల్ ఎన్‌పీడీసీఎల్ సంస్థ సాంకేతికతను ఉపయోగించుకొని వినియోగదారులకు మెరుగైన సేవలను అందించేందు కు కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే రైతులకు కూడా మరిన్ని సేవలు అందించాలని నిర్ణయించారు. రైతులు తమ పంట పొలాల్లో మోటార్లకు బిగించుకున్న ఆటో స్టాటర్‌లను తొలగించాలని వాటి స్థానంలో కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఆటో స్టాటర్‌ల వల్ల కలిగే నష్టాన్ని రైతులకు వివరిస్తున్నారు. వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు పనిచేయకపోతే వెంటనే 1912 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు అందించాలని సూచిస్తున్నారు. ఈ ఫిర్యాదు సంబంధిత అధికారి మొబైల్‌యాప్‌కి వెళుతుందని అధికారి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ చెక్ చేసి మళ్లీ దాని స్టేటస్‌ను యాప్‌లోనే నమోదు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందని వివరిస్తున్నారు. వ్యవసాయ పంప్‌సెట్లకు ఎర్తింగ్ సౌకర్యం కల్పించుకోవాలని అధికారులు చెబుతున్నారు.

అరచేతిలో పూర్తి సమాచారం

విద్యుత్‌శాఖకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అరచేతిలో అందుబాటులో ఉండే విధంగా ఎన్‌పీడీఎల్ సంస్థ కొత్త టెక్నాలజీతో సేవలు మొదలుపెట్టింది. వినియోగదారులకు సంస్థకు సంబంధించిన అన్ని రకాల సమాచారాన్ని అందుబాటులో ఉంచేందు కోసం డాష్‌బోర్డు అప్లికేషన్‌ను అమలు చేస్తోంది. దీని కారణంగా వర్క్‌ఫోర్స్ మేనేజ్‌మెంట్, అవుటేజ్ మేనేజ్‌మెంట్ సిస్టం, డిమాండ్ సైడ్ మేనేజ్‌మెంట్, కస్టమర్ పోర్టల్ సిటిజెన్ మేనేజ్‌మెంట్ సిస్టం, మీట ర్ డాటా మేనేజ్‌మెంట్‌కు సంబంధించి అంశాలన్నిం టిని ఇటు సంబంధిత అధికారులు, సిబ్బంది అటు సాధారణ విద్యుత్ వినియోగదారులు తెలుసుకునేందుకు అవకాశం ఏర్పడబోతోంది. అలాగే కరెంటు సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను లెక్కించేందుకు రెండు కొత్త ఇండెక్స్ సిస్టంలను అమలు చేయనున్నారు. సిస్టం యావరేజ్ ఇంటపర్షన్ డురేషన్ ఇండెక్స్ (సైదీ), అలాగే సిస్టం యావరేజ్ ఇంట రప్షన్ ఫ్రీక్వేన్సీ ఇండెక్స్ (సైఫీ)లతో విద్యుత్ సరఫరాలో జరుగుతున్న అంతరాయాలను రోజువారీగా లెక్కించబోతున్నారు. దీంతో కరెంటు సరఫరాలో సగటుతో బాటు మొత్తం ఎన్నిసార్లు అంతరాయం జరిగిందనే విషయాలను తెలుసుకునేందుకు రియల్ టైం డాటా అందుబాటులోకి రానుంది. ఈ వివరాలన్నింటిని ఏడాది పాటు అందుబాటులో కూడా ఉంచనున్నారు.



విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉన్న టాన్స్‌ఫార్మర్లు

ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా నిర్వహణ

ఎన్‌పీడీసీఎల్ సంస్థ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌ను సైతం సద్వినియోగం చేసుకునేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) ద్వారా కొనసాగుతున్న చాట్‌బోట్‌లో ఎన్‌పీడీసీఎల్ సంస్థకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని అందుబాటులో ఉంచనున్నారు. ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టంను అందుబాటులో ఉంచి కమాండ్ కంట్రోల్ సిస్టంలోని వివరాలన్నింటిని తెలుసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. అలాగే అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్ అనే సిస్టం కూడా అమలు చేస్తున్నారు. 33/11 కెవి విద్యుత్ స్థంభాలకు యూనిక్ నంబర్‌లను కేటాయించి ఆ పోల్‌ల వారిగా వాటినంబర్లతో లోకేషన్ మ్యాపింగ్ చేపడుతూ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్‌లలో ఏర్పడే అంతరాయాలను ఎప్పటికప్పుడు తొలగించనున్నారు.





అడెల్లి ఆలయంలో హుండీ లెక్కింపు పూర్తి



హుండీని లెక్కిస్తున్న ఆలయ ఉద్యోగులు, భక్తులు

సారంగాపూర్, సెప్టెంబరు 23 : మండలంలోని మహా ప్రసిద్ధి గాంచిన అడెల్లి మహా పోచమ్మ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఈ హుండీ లెక్కింపులో నగదు రూ. 40 లక్షల 69 వేల 281, బంగారం 235 గ్రాములు, వెండి 4 కిలోల 800ల గ్రాములు వచ్చినట్లు ఆలయ ఇంచార్జి ఈవో రాజా మొగిలి తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, మహిళా భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు ఉన్నారు.

బస్సు దొంగతనం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నిర్మల్, సెప్టెంబరు 23 : నిర్మల్ పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన బస్సు దొంగతనం చేసిన వ్యక్తిని పట్టుకున్నట్లు నిర్మల్ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం... నిర్మల్ పట్టణంలోని బస్ డిపోలో రాత్రి 11 గంటలకు గణేష్ అనే వ్యక్తి బస్ డిపో గోడ దూకి నిర్మల్ డిపోకి చెందిన బస్సు నెంబర్ ఏపీ01 జెడ్0076ను దొంగిలించి కడ్తాల్ వైపు తీసుకెళ్లాడు. పోలీసులకు విషయం తెలపగానే వెంటనే వారు ఆ బస్సును వెంబడించి నేషనల్ హైవే వద్ద పట్టుకున్నారు. ఆర్టీసీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

'రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం రావాలి '

నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 23 : రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టేలా ప్రతీఒక్కరూ శ్రమించాలని రాష్ట్ర నాయకుడు రాంనాథ్ పిలుపునిచ్చారు. సోమవారం శాంతినగర్‌లోని హౌసింగ్‌బోర్డు కాలనీలో సభ్యత్వం నమోదు చేపట్టారు. సభ్యత్వ లక్ష్యం చేరుకోవాలన్నారు. తిరుమల శ్రీవారి లడ్డువివాదంపై విచారణ పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు నాగేందర్, సత్యపాల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాంనాథ్

వర్ని గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కలెక్టరేట్‌లో వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కుభీర్, సెప్టెంబరు 23 : మండలంలోని వర్ని గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు సోమవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 500 జనాబా, 260 ఓటర్లు తమ గ్రామంలో ఉన్నారని, గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరారు. ఈ వినతి అందించిన వారిలో గ్రామస్థులు కైలాస్, సంతోష్, నాగేష్, మహేష్, దర్శన్, ఎర్రన్న, తదితరులున్నారు.

మా వార్డులకు నిధులు కేటాయించకుండా మున్సిపల్ చైర్మన్ వివక్ష చూపుతున్నారు

- విలేకరుల సమావేశంలో వార్డు కౌన్సిలర్ల ఆవేదన
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి



కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదుల ప్రతులను చూపుతున్న కౌన్సిలర్లు

ఖానాపూర్, సెప్టెంబరు 23 : తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులకు నిధులు కేటాయించకుండా మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్‌లు వివక్ష చూపుతున్నారని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ అబ్దుల్ ఖలీల్, రెండవవార్డు కౌన్సిలర్ సంకీర్తనలు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని విశాంతి భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పట్టణ అభివృద్ధి కొరకు తెలంగాణ ప్రభుత్వం టీయూటీఎఫ్ ఐడీసీ ద్వారా రూ.4.8 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నిధులను 12 వార్డులలో రూ. 40 లక్షల చొప్పున ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. కానీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 11 వార్డుకు రూ. 1.19 కోట్ల నిధులను కేటాయించుకుని అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల వార్డులకు రూ.40 లక్షల చొప్పున నిధులను కేటాయించారన్నారు. కానీ ప్రతిపక్ష కౌన్సిలర్లుగా ఉన్నామనే ఏకైక కారణంతో మా వార్డులకి కేవలం రూ.10 లక్షల చొప్పున మాత్రమే నిధులు కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులలో ఉద్దేశపూర్వకంగా అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌లపై చర్యలు తీసుకోవాలన్నారు. తమ వార్డులలో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన టీయూటీఎఫ్ ఐడీసీ నిధుల ద్వారానైనా తమ వార్డులలో సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశిస్తే మున్సిపల్ చైర్మన్ తమపై కక్షతో ప్రజలను ఇబ్బందులకు గురి చేసేలా వ్యవహరించడం సరికాదన్నారు. ఇప్పటికైనా ఈ కేటాయింపులపై విచారణ జరిపి నిలిచిన టెండర్లను రద్దు చేసి ప్రతి వార్డుకు సమానంగా నిధులను కేటాయించి నూతన టెండర్లను పిలవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వార్డు ప్రజలతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరవధిక దీక్ష కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ విషయమై సోమవారం చైర్మన్ సత్యం, కమిషనర్ మనోహర్‌లపై ఫిర్యాదుల విభాగంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు పేర్కొన్నారు.

యువతరంగ్ సంఘం నూతన కార్యవర్గం

కుభీర్, సెప్టెంబరు 23 : మండల కేంద్రం కుభీర్‌లోని యువతరంగ్ యూత్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎనుకున్నట్లు నూతన అధ్యక్షులు యోగేష్ తెలిపారు. అధ్యక్షునిగా ఎస్.యోగేష్, ఉపాధ్యక్షులుగా సంతోష్, సెక్రటరీగా నిఖిల్, మీడియా బుర్రెల్లి మహేష్, సభ్యులుగా ఎన్నుకున్నారు. వీరిని పలువురు అభినందించారు.

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



హాజరైన అధికారులు

కలెక్టర్ అభిలాష అభినవ్



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్, సెప్టెంబరు 23 : ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చి ప్రజల నుంచి ఆమె అర్జీలను స్వీకరించారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూసమస్యలు, రెండు పడక గదుల ఇళ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటి వరకు పెం డింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అలాగే సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించినప్పుడు వాటికి సంబంధించిన వివరాలను క్లుప్తంగా రిమార్కుల విభాగంలో పొందుపరచాలని ఆదేశించారు. దరఖాస్తు దారులకు పరిష్కారానికి సంబంధించిన వివరాలను అందజేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదల కోసం ప్రారంభించిన బాలశక్తి కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు పాల్గొని పర్యవేక్షించాలన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రజావాణి లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్వో భుజంగ్‌రావు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ కార్యాలయంలో ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

నిర్మల్, సెప్టెంబరు 23 : జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంలో నూతన ఏటీఎం కేంద్రాన్ని కలెక్టర్ అభిలాష అభినవ్ ప్రారంభించారు. సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి నూతన ఏటీఎం కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, బ్యాంకు అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కలెక్టరేట్ కార్యాలయ అధికారులు, సిబ్బందికి, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఈ ఏటీఎం ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ఏటీఎం సేవలను వినియోగించుకోవాలన్నారు. ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభించిన బ్యాంక్ అధికారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో భుజంగ్‌రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్, ఇతర బ్యాంక్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఏటీఎం కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, పక్కన బ్యాంకు అధికారులు

ఆర్‌డీవో కార్యాలయాన్ని ముట్టడించిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

- వసతులు, సౌకర్యాలు కల్పించి ఇళ్లను కేటాయించాలని డిమాండ్

భైంసా, సెప్టెంబరు 23 : లక్కీ డ్రా ద్వారా ఎంపికైన తమకు వసతులు, సౌకర్యాలు కల్పించి ఇళ్లను కేటాయించాలని డిమాండ్ చేస్తూ భైంసా పట్టణ డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు ఆర్‌డీఓ కార్యాలయాన్ని ముట్టడించారు. సోమవారం పట్టణ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు స్థానిక విశ్రాంతి భవనం నుంచి ఆర్‌డీవో కార్యాలయం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు, ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం ఆర్‌డీవో కార్యాలయాన్ని ముట్టడించి భైఠాయించారు. తమకు పూర్తి స్థాయి వసతులు, సౌకర్యాలు కల్పించి ఇళ్లను కేటాయించేంత వరకు కదలబోమని స్పష్టం చేసి ఆందోళనలు చేపట్టారు. ఇందుకు స్పందించిన ఆర్‌డీవో కోమల్‌రెడ్డి డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులతో మాట్లాడి సముదాయించారు. డబుల్ బెడ్ రూమ్ గృహ సముదాయాలకు అవసరమైన వసతులు, సౌకర్యాల కల్పనకు సంబంధించి అనుమతులు, నిధుల మంజూరి కోసం ప్రతిపాదనలు నివేదించామన్నారు. అనుమతులు రాగానే నీటి వసతి, విద్యుత్ వ్యవస్థ, మురికి కాలువల ఏర్పాటు తదితర పనులు పూర్తి చేసి డబుల్ బెడ్ రూమ్‌లను లబ్ధిదారులకు అందచేస్తామని వెల్లడించారు.



అర్‌డీవో కార్యాలయం ముందు భైఠాయించిన డబుల్ బెడ్ రూమ్ లబ్ధిదారులు

సంక్షిప్త సమాచారం

మా ప్రాంతంలో ఇథనాల్ పరిశ్రమ వద్దే వద్దు

- దిలావర్‌పూర్ గ్రామస్థుల డిమాండ్

దిలావర్‌పూర్, సెప్టెంబరు 23 : ఇథనాల్ పరిశ్రమ మా ప్రాంతంలో వద్దే వద్దని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామస్తులు స్పష్టం చేశారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై రైతులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఇథనాల్ పరిశ్రమపై రైతులకు, గ్రామస్థులకు ఉన్న అనుమానాలు నివృత్తి చేసేందుకు స్థానిక రైతు వేదికలో సమావేశం నిర్వహించారు. అందుకోసం యాజమాన్యం ప్రతినిధులు రైతు వేదికలో ఇథనాల్ ప్రయోజనాలపై వివరించేందుకు ప్రొజెక్టర్లను ఏర్పాటు చేశారు. దీనిపై రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మీరు ఎన్ని చేసినా ఏం చెప్పినా ఇథనాల్ పరిశ్రమ మాత్రం అడ్డుకుంటామని చెప్పారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో కంపెనీ ప్రతినిధులు ప్రొజెక్టర్‌లను తొలగించి సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఆ తర్వాత తహసీల్దార్ స్వాతి ఇథనాల్ పరిశ్రమ ఎందుకు వద్దనుకుంటున్నారని ప్రశ్నించగా ఒక్కొక్కరు సమాధానం చెప్పేందుకు ప్రయత్నించగా ఆమె మాట్లాడనీయకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తహసీల్దార్ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని రైతులు ఆరోపించారు ఏది ఏమైనా పరిశ్రమ నిర్మాణం వద్దని రైతులు ఖరాఖండిగా చెప్పి సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఈ సమావేశంలో తహసీల్దార్ స్వాతితో పాటు ఎంపీడీవో అరుణ రాణి, ఇరిగేషన్ డీఈ ఎంఆర్ఐ సంతోష్, రైతులు, వివిధ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

కుభీర్, సెప్టెంబరు 23 : మాదక ద్రవ్యాలపై విద్యార్థులు అవగామన కలిగి ఉండాలని సోషల్ జస్టిస్ ఫర్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నియోజక వర్గ డైరెక్టర్ సాప పండరి అన్నారు. సోమవారం మండల కేంద్రం కుభీర్‌లోని ప్రభుత్వ .జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. గంజాయి, సిగరేట్, వైన్, గుట్కా, లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, మాదక ద్రవ్యాల వలన కలిగే అనార్థాలను తెలుసుకొని అందరికి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సంపత్, హనుమంతరావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

'కుభీర్ మండల విద్యాధికారిపై చర్య తీసుకోవాలి'

నిర్మల్, సెప్టెంబరు 23 : కుభీర్ మండల విద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని యువ సంఘర్ష సమితి (సీవైఎస్ఎస్) జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శీతల్కర్ అరవింద్ కలెక్టరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్‌ను సోమవారం కలిసి డిమాండ్ చేశారు. మండల విద్యాధికారి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అవినీతికి పాల్పడుతూ ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్నాడని దుయ్యబట్టారు. కుభీర్ మండల విద్యాధికారిపై పలుమార్లు జిల్లా విద్యాధికారికి, కలెక్టర్‌కి ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ జరపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుభీర్ మండలంలోని సౌనా పార్డి(కే) పాఠశాలలో ఉన్న ఏకోపాధ్యాయులను రిలీజ్ చేయడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అదే మండలంలో బిట్‌కాయిన్ దందానే పరమావధిగా పాఠశాలను గాలికొదిలేసి విదేశాలకు వెళ్తున్న చోద్యం చూస్తున్నారే తప్ప ఒక్కరోజైనా ఆ పాఠశాలలను పర్యవేక్షించకపోవడం మండల విద్యాధికారి నిర్లక్ష్య వైఖరికి అవినీతికి నిదర్శమని ఆరోపించారు.

జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో

ఆకతాయిల ఆగడాలు!

● పట్టించుకోని పోలీసులు, గ్రామస్థులు ● భయభ్రాంతులకు గురవుతున్న విద్యార్థులు


పాఠశాల బాత్‌రూంలో పడి ఉన్న మద్యం సీసాలు


బాత్‌రూంలో పగల గొట్టిన మద్యం సీసా ముక్కలు

జైనథ్ రూరల్, సెప్టెంబరు 23: మండల కేంద్రంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆకతాయిల ఆఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఆదివారం రాత్రి గుర్తు తెలియని ఆకతాయిలు బాలికల మూత్రశాలలో మద్యం తాగి మద్యం సీసాలను పగులగొట్టి చిందరవందరగా చేశారు. దీంతోపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు ఎవరూ క్యావింజర్స్ లేకపోవడంతో అర్ధరాత్రి గుర్తు తెలియని ఆకతాయిలు వచ్చి మద్యం తాగి ఆ బాటిళ్ల పగులగొట్టి విద్యార్థులకు నడవకుండా చేస్తున్నారు. దీంతో పాటు పాఠశాల ఆవరణలో పేకాట ఆడుతున్నారు. ఈ ఘటనలు పలుమార్లు జరుగుతున్నా అధికారులు, పోలీసులు తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు జైనథ్ గ్రామస్థులు అంటున్నారు. దీంతో మూత్రశాలకు వెళ్లాలంటే విద్యార్థులు భయభ్రాంతులకు గురవుతున్నారు. జైనథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కూతవేటు దూరంలో పోలీసు స్టేషన్ ఉన్న ఆకతాయిలకు ఎలాంటి భయం లేక పోగా రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ శూన్యంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాల ఆవరణలో మద్యం పేకాట పలు అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు.

డీజే శబ్దాలకు ఇద్దరు మహిళలకు అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

బోథ్, సెప్టెంబరు 23: గణేష్ నిమజ్జన ఉత్సవాల సందర్భంగా డీజే శబ్దాలకు మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డీజే నిర్వాహకులు ఇష్టం వచ్చిన రీతిలో సౌండ్‌ను పెంచడంతో పలువురు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. కొంతమంది వ్యక్తులు డీజేల శబ్దాలు విన లేక ఇతర గ్రామాలకు తరలివెళ్లిపోయారు. గుండె జబ్బుల వారు ముందుగానే తమ ఇల్లును విడిచి బంధువుల ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే మండల కేంద్రంలో వాణి అనే మహిళ డీజే శబ్దానికి తీవ్ర అస్వస్థత గురైంది. చెవిలో నుంచి రక్తం కారడంతోపాటు సోమవారం ఉదయం అస్వస్థత గురించి పడిపోవడంతో ఆమెను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. అలాగే మండలంలోని సోనాల గ్రామంలో సైతం ఓ మహిళ డీజేలా శబ్ధకాలుష్యంతో అస్వస్థతకు గురై ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలి వెళ్లినట్లు సమాచారం. ఏదిఏమైనా ఈసారి డీజేల వారు ఒకరికి మించి ఒకరు పోటీ పడి డీజే నడపడం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురికావాల్సి వచ్చిందని వాపోతున్నారు.


బోథ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన జ్వర పీడితులు

జ్వరం బారిన పడ్డ బోథ్‌వాసులు

● ఎటు చూసినా జ్వర పీడితులే..

బోథ్, సెప్టెంబరు23: మండలంలోని విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. రోజురోజుకు జ్వరపీడితులు సంఖ్య పెరిగిపోతోంది. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం 11 గంటల వరకు 3 వందల మంది అవుట్ పేషెంట్లుగా రావడం జరిగింది. అంతేగాక వివిధ హాస్టల్‌లో సైతం జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. కస్తూర్బా పాఠశాల నుంచి సోమవారం ఉదయం పది మంది వరకు విద్యార్థులు జ్వరంతో వైద్యం కోసం ఆసుపత్రికి రావడం జరిగింది. ఒక వైపు జ్వరాల తీవ్రత మండల కేంద్రాన్ని పట్టి పీడిస్తుంటే మరో వైపు గ్రామాలలో సైతం జ్వరాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఫలితంగా ప్రైవేట్ ఆసుపత్రిలో రోగులు నిండుకుంటున్నాయి. ప్రభుత్వం గ్రామాల వారీగా వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మరో వైపు వివిధ రాష్ట్రాలలో ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి జ్వరం బారిన పడ్డ విద్యార్థులకు వైద్య సేవలు అందించాల్సిన అవసరం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

చంద్రపూర్ నియోజకవర్గ శాసనసభ

ఎన్నికల ప్రచారంలో ఆదిలాబాద్ ఎంపీ

బోథ్, సెప్టెంబరు 23: మహారాష్ట్రలో జరగనున్న శాసనసభ ఎన్నికల చంద్రపూర్ నియోజకవర్గ ఇంచార్జిగా ఆదిలాబాద్ జిల్లా ఎంపీ జి.నగేష్‌కు బాధ్యతలను అప్పగించారు. దీంతో ఎంపీ చంద్రపూర్ నియోజకవర్గంలో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ ఎన్నికల సన్నాహాక సమావేశాలను నిర్వహిస్తున్నారు. చంద్రపూర్‌లో అమ్మవారి ఆలయాన్ని సందర్శించి సోమవారం ఉదయం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆయన వెంట చంద్రపూర్ నియోజకవర్గ నాయకులు ఉన్నారు.


నల్లబ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్‌లో నల్ల జెండాలతో నాయకుల నిరసన

ఆదిలాబాద్, సెప్టెంబరు 23: కార్మికులకు అండగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటూ చట్టాలను తీసుకువచ్చిందని ఏఐటీ యూసీ, టీయూసీఐ నాయకులు అన్నారు. ఏఐటీ యూసీ, టీయూసీఐ ఆధ్వర్యంలో బ్లాక్ డేలో భాగంగా నిరసన తెలిపి తెలంగాణచౌక్‌లో నల్లజెండాలను పట్టుకొని కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించిన చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా చేసి కార్పొరేట్ శక్తులను సంపదను కూడబెట్టేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించిందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రదేవేందర్ అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, టీయూసీఐ ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్, సహాయ కార్యదర్శి నితిన్, ఎండీ ముజీబ్, మహేందర్, ఉయికే రమేష్, ఎండీ ఖాసీం, సైఫ్‌ఖాన్, రాజు తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్షోత్సవాలు

ఉట్నూర్, సెప్టెంబరు23: ఉట్నూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో పోషణ పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఉట్నూర్ సీడీపీఓ మాస ఉమా తెలిపారు. సోమవారం మండలంలోని దంతనపల్లి సెక్టార్ పరిధిలో ఉన్న భూపేట, నాగపూర్, హీరజన్వాడ, దంతనపల్లిలలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు దంతనపల్లి పీహెచ్‌సీలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీడీపీఓ ఉమా పరిశీలించి సెక్టార్‌ల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలలో రక్తలేమి ఉన్న చిన్నారులను గుర్తించి వారికి సరైన పోషక విలువలు గల ఆహారం అందించడానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో దంతనపల్లి పీహెచ్‌సీ డాక్టర్ కోవ అనురాధా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జాదవ్‌విజయ, అంగన్‌వాడీ టీచర్లు జమునా, కవిత, నాగమణి, రేవతది తదితరులున్నారు.

'నిర్ణీత గడువులోగా సభ్యత్వాలను పూర్తి చేయాలి'

నేరడిగొండ, సెప్టెంబరు23: బీజేపీ సభ్యత్వాలను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కుంటాల, వెంకటాపూర్, పట్పటితండా, వాగ్ధారి గ్రామాలలో సభ్యత్వ నమోదు ప్రక్రియను పరిశీలించి కొన్ని సూచనలు చేశారు. పార్టీ మండలానికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సభ్యత్వ నమోదులో నేరడిగొండ మండలం అగ్రగామిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గట్టునారాయణ, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు చెట్‌పల్లి వెంకటేశ్, పోలింగ్ బూత్ అధ్యక్షులు అర్జున్, మోతిరాం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ధర్నా

ఆదిలాబాద్, సెప్టెంబరు23: కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం బ్లాక్‌డేలో భాగంగా నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ఈ సందర్భంగా నాయకులు అన్నమొల్ల కిరణ్ మాట్లాడుతూ కార్మికులకు సమాన పనికి సమాన వేతన ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ కొమ్ము కాసే విధంగా కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జఆశన్న, జిల్లా కమిటీ సభ్యులు పండగ పోచన్న, ఆర్.సురేందర్, దర్శనాల నగేష్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు నర్సింగ్, సుభాష్, శేషరావు, నాయకులు పాల్గొన్నారు.

'దివ్యాంగుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 23: ఆదిలాబాద్‌లో ప్రభుత్వ స్థలం గుర్తించి దివ్యాంగుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని హ్యాండిక్యాప్ హెల్పింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు మహ్మద్ ఇమ్రాన్ అన్నారు. ఈ విషయమై కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. అర్హులైన ప్రతీ దివ్యాంగుడికి ఆసరా పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఫైసల్, సాజిద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఉపాధ్యాయ సంఘ నాయకులు

బోథ్, సెప్టెంబరు23: మండలానికి చెందిన పీఆర్‌టీయూ కార్యవర్గ సభ్యులు సోమవారం స్థానిక శాసనసభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. బోథ్, బజార్హత్నూర్, నేరేడిగొండ, గుడిహత్నూర్ మండలాలకు చెందిన నూతన కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్యేను కలవడంతో ఎమ్మెల్యే వారిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంలో కాంతిరేఖ వంటి వారని వారు సమాజపపు రూపురేఖలు మారుస్తారన్నారు. బంగారు భవిష్యత్తుకు బాట వేసేది ఉపాధ్యాయులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివఆస్, నేరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఆర్‌టీయూ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'ఆదిలాబాద్‌కి డీసీసీ అధ్యక్షుడిని నియమించాలి'

నార్నూర్, సెప్టెంబరు23: ఆదిలాబాద్ జిల్లాకి గత కొన్ని సంవత్సరాల నుంచి ఖాళీగా ఉన్న డీసీసీ అధ్యక్ష పదవిని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గం నియమించాలని కాంగ్రెస్ పార్టీ మండల కార్యకర్తలు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ జిల్లా నాయకులు షేక్ సత్తార్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు పీఠం ఖాళీగా ఉన్నందున తమ కార్యకర్తల సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ కార్యకర్తలను ఎన్నో ఇబ్బంది పెట్టినా తాము పార్టీ వదలకుండా ఉన్నామని, ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేదవారికి న్యాయం జరుగుతుందని ఎంతో శ్రమించామన్నారు. రాష్ట్ర నాయకత్వం వెంటనే ఆదిలాబాద్ జిల్లాకి డీసీసీ అధ్యక్షుడిని నియమించాలని కోరారు.

జిల్లాస్థాయి ఉపన్యాస పోటీలో సాలెవాడ విద్యార్థికి ప్రథమ స్థానం

ఉట్నూర్, సెప్టెంబరు 23: హిందీ భాషా సేవా సమితి ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఉపన్యాస పోటీలలో ప్రథమ స్థానం పొందిన మండలంలోని సాలెవాడకే జడ్పీఎస్ఎస్ విద్యార్థి వాఘ్మారే సంఘ్ చరణ్‌జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారని పాఠశాల హెచ్‌ఎం సింగిడి రమేష్‌రెడ్డి తెలిపారు. హిందీ దివాస్ సందర్భంగా జిల్లాకేంద్రంలోని పూలేగెస్ట్‌హౌజ్‌లో జరిగిన కార్యక్రమంలో హిందీ దివాస్ ఘనంగా జరుపుకోవడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా తమ పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు జాదవ్‌శేషరావుకు కూడా ప్రశంస పత్రం ఇచ్చారని చెప్పారు. సాలెవాడ పాఠశాలలో సోమవారం ప్రార్థన సమయంలో విద్యార్థికి ఉపాధ్యాయులు ప్రశంసించినట్లు పేర్కొన్నారు.

సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

బోథ్, సెప్టెంబరు23: మండలంలోని పిప్పలదరి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఇటీవల మృతి చెందడంతో స్థానిక శాసనసభ్యులు జాదవ్ అనిల్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబీకులను ఓదార్చారు. ఎలాంటి ఆందోళన చెందవద్దని తాము శక్తి మేరకు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఆయనవెంట మాజీ ఎంపీపీలు తుల శ్రీనివాస్, సజన్లాల్‌తో పాటు నాయకులు డాక్టర్ స్వామి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ మండలాధ్యక్షుడిగా జక్కుల శ్రీనివాస్

తాంసిరూరల్, సెప్టెంబరు 23: తాంసి మండల పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఎన్నిక సోమవారం మండల కేంద్రంలో జరిగింది. మండలంలోని ఆయా పాఠశాలలో పని చేస్తున్న పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. అధ్యక్షునిగా జక్కుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా జక్కుల రవీందర్‌చ అసోసియేట్ అధ్యక్షునిగా తులా శ్రీనివాస్, మహిళా సంఘం అధ్యక్షురాలుగా సంగీత, తదితరులు ఎన్నికయ్యారు. వీటిని మండల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.



వాగులోని చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

చాంద వాగు వద్ద స్వచ్ఛతా హీ సేవా

ఆదిలాబాద్, సెప్టెంబరు 23: ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదిలాబాద్ పట్టణ శివారులోని చాందా వాగు వద్ద శుభ్రత కార్యక్రమాన్ని మున్సిపల్ సిబ్బంది సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇటీవల వినాయక నిమజ్జనం సందర్భంగా కరగని విగ్రహాలను, చెత్తాచెదారం తొలగించి వాగు ఘాట్‌తో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేసినట్లు వారు పేర్కొన్నారు. ఇందులో శానిటరీ ఇన్స్‌పెక్టర్ బైరి శంకర్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ అవికిరాన్, మెప్మా టీఎంసీ భాగ్యలక్ష్మి ఉన్నారు.

'ఇందిరా ఫెలోషిప్‌తో మహిళల్లో చైతన్యం'

మావల, సెప్టెంబరు 23: మహిళల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఇందిరా ఫెలోషిప్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, ఇందిరా ఫెలోషిప్ ఉమ్మడి జిల్లా యూనిట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ తెలిపారు. ఇందిరా ఫెలోసిప్ ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశంతగా సోమవారం మావల మండల కేంద్రంలో ఫెలోషిప్ మెంబర్స్‌కి బూట్ క్యాంప్ వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సమావేశంలో మేధావులు, వ్యాపార వేత్తలు, డాక్టర్స్, సాంకేతిక నిపుణులు, సామాజిక, రాజకీయ నేతలతో, నేటి సమాజంలో ప్రత్యేకంగా భారత రాజకీయాల్లో మహిళల పాత్ర, వాళ్ల ఎదుర్కొంటున్న సవాళ్ల, భవిష్యత్తు రాజకీయ అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ తెలంగాణ కోఆర్డినేట్ శివలాల్ నేతికల్, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గిమ్మ సంతోష్, పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'పండగలు ఘనంగా నిర్వహించేలా కృషి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 23: సంప్రదాయం ప్రకారం పండుగలను ఘనంగా నిర్వహించేలా కృషి చేస్తున్నామని సనాతన హిందూ ఉత్సవసమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్‌ఖత్రి అన్నారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యవర్గాన్ని ఎన్నుకోగా మూడవ సారి కూడా ప్రమోద్‌కుమార్‌ఖత్రిని అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. కాగా సోమవారం గోపాలకృష్ణ మఠంలో నూతన కార్యవర్గాన్ని సత్కరించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ ఖత్రి మాట్లాడుతూ సనాతన ధర్మంలోని పండుగల విశిష్టతను తెలియజేసేలా ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. గత 13ఏళ్లుగా వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నందున మూడోసారి కూడా తనకు అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు బండారివామన్, కోశాధికారి పడకండి సూర్యకాంత్, పూసం ఆనందరావు, సంజీవ్, సంతోష్, నర్సింగ్, దశరథ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

'హమాలీల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి'

ఆదిలాబాద్, సెప్టెంబరు 23: హమాలీలకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అందజేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త బ్లాక్‌డే సందర్భంగా సీడబ్ల్యూసీ గోదాంలో హమాలీలతో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీడబ్ల్యూసీ ఎఫ్‌సీఐ స్టేట్ వేర్‌హౌజింగ్ కార్పొరేషన్ తదితర గోదాంల్లో పని చేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించడంలో, వారికి సౌకర్యాలు భద్రత కల్పించడంలో విఫలమయ్యారని అన్నారు. హమాలీలు చాలా ఏళ్లుగా వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి భద్రత కల్పించాలని అనేక పోరాటాలు చేస్తున్న పట్టిపట్టనట్లు వ్యవహరంచడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇందులో హమాలీ యూనియన్ నాయకులు దస్తగిరి శంబాజి, వసంత్‌గోపాల్, ప్రమోద్, రోహిదాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాలేదు.. వ్యవసాయం చేసేది ఎలా?

● పట్టా పుస్తకాలతో రైతుల నిరసన ● ఇచ్చోడ మండలం ముక్రా(కె) గ్రామం నుంచి సీఎం కార్యాలయానికి సెల్ఫీ చిత్రాలు

ఇచ్చోడ, సెప్టెంబరు, 23: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలోని ముక్రా(కె) గ్రామానికి చెందిన రైతులు సోమవారం వినూత్న నిరసన చేపట్టారు. రుణమాఫీ కానీ రైతులు గ్రామంలోని పంటపొలంలో పట్టా పాసు పుస్తకాలను చేతిలో పట్టుకొని సెల్ఫీ దిగి నిరసనను చేపట్టారు. సెల్ఫీ దిగిన అనంతరం ఆ చిత్రాలను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపినట్లు రైతులు పేర్కొన్నారు. రూ. 2లక్షలకు పైబడి లోన్ ఉన్న రైతు లకు రుణమాఫీ కాలేదని? వ్యవసాయం చేయడం ఎలా అని? ఆందోళన చేశారు. వర్షాకాలం ముగుస్తున్న.. ఇప్పటివరకు రూ. 15వేల రైతు భరోసా ఇవ్వలేదని, దీంతో రైతులు అప్పులు తీసుకొవచ్చి వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి ఎదురైందన్నారు. రుణమాఫీ కానీ రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. లేనియెడల రైతులు హైదరాబాద్‌లోని ప్రభుత్వ కార్యాలయాలను ముట్టడి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గాడ్గె సుభాష్, తిరుపతి, మారుతి, జ్ఞానేశ్వర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



పట్టా పాసు పుస్తకాలతో సెల్ఫీలు దిగుతున్న రైతులు

ప్రజా సమస్యలను పరిశీలించేందుకే పర్యటన

బోథ్, సెప్టెంబరు 23: ప్రజా సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో వారి కాలనీలకు వెళ్లి పర్యటించడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 15 వ వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి



15వ వార్డులో స్థానిక సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్

తెలుసుకున్నారు. కాలనీ వాసులు తమ కాలనీలో మురికి కాలువ నిర్మించాలని ఎమ్మెల్యేని కోరగా తాత్కాలిక డ్రేమ్ పనులు ప్రారంభించాలని ప్రత్యేక అధికారి తెలుసుకున్నారు. కాలనీ వాసులు తమ కాలనీలో మురికి కాలువ నిర్మించాలని ఎమ్మెల్యేని కోరగా తాత్కాలిక డ్రేమ్ పనులు ప్రారంభించాలని ప్రత్యేక అధికారికి సూచించారు. కాలనీలోపిచ్చి మొక్కలు పెరిఆయని వాటిని తొలగించాలని సూచించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

● విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే

నేరడిగొండ: విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేకశ్రద్ధ కనబరిచాలని, వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, నేరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, పీఆర్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు, బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, గుడిహత్నూర్ మండల నూతన కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

'ఆదివాసీలను బేషరతుగా విడుదల చేయాలి'

ఉట్నూర్, సెప్టెంబరు 23: కవ్వాల్ అభయారణ్యంలో ఆవాసాలు ఏర్పాటు చేశారనే నేపంతో అరెస్టు చేసిన ఆదివాసులను భేషరతుగా విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన కేసులను ఎత్తి వేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా ఉపాధ్యక్షుడు సిడాం జంగ్‌దేవ్ డిమాండ్ చేశారు. సోమవారం పాలకూరి గిరిజనులతో కలిసి ఐటీడీఏకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా జన్నారం అటవి ప్రాంతంలో ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నారనే నెపంతో పది మంది ఆదివాసీలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు తరలించడాన్ని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అటవీ హక్కుల చట్టం 2006 ఆదివాసీలకు అడవిలో నివసించే హక్కును కల్పిస్తున్నదని ఆదివాసీలు తమ స్వభావారీత్యా స్థిర నివాసాలు ఏర్పరచుకుంటు అడవీ ప్రాంతాలలో సంచార జీవితం గడుపుతుంటారన్నారు. ఆహార సేకరణలో భాగంగా వివిధ అటవి ప్రాంతాలకు సంచారం వెళ్లి మళ్లీ తిరిగి వస్తుంటారని, అందులో భాగంగానే కవ్వాల్ అటవి ప్రాంతంలో తాత్కాలిక ఆవాసాలను గుడారాలుగా, గుడిసెలుగా ఏర్పాటు చేసుకున్నారని, టైగర్ జోన్‌ను ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా ప్రారంభించిన అప్పటి పాలకులు వేల మంది ఆదివాసీలను నిర్వాసితులుగా మార్చారన్నారు. నిజానికి కవ్వాల్ పులుల అభయారణ్యం అనే పేరు తప్పితే నేడు అక్కడ ఒక్క పులి కూడా లేని వాస్తవాన్ని అధికారులు దాస్తున్నారన్నారు. మరోవైపు నిలువ నీడలేని ఆదివాసీలు తాత్కాలిక ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటే వారికి కౌన్సెలింగ్ ఇవ్వకుండా వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టడం వారిని జైలుకు పంపడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇంద్రవెల్లిలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ పేరుతో ఆదివాసీలకు జల్ జంగల్ జమీన్ పై అధికారం ఇస్తామని భీం ఆశయాలను కొనసాగిస్తామని మాట్లాడిన సీఎంహామీలను విస్మరిస్తూ నేడు ఆదివాసీలను జైలుపాలు చేయడం సరికాదని వెంటనే అక్రమంగా అరెస్టు చేసిన ఆదివాసీల పై కేసులు ఎత్తివేసి విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఆదివాసీ నాయకులు కొమురం కోటేశ్వరరావు, పెందూరు, మోతిరాం, పెందూరు జనార్ధన్, కవ్వాల్ పాలకోరి గ్రామ బాధితులు మేస్రం గంగారాం, సిడాంబాలు, తొడసం విష్ణు, కుమ్ర లక్ష్మణ్, కనక చంద్రభాన్, నైతం మన్కు, సిడాం మోతిరాం, ఆత్రం లాల్సాష్, పెందూరు సూర్యలు, తదితరులున్నారు.



కోసాయి పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను పూర్తి చేయండి : ఎంపీడీవో

తలమడుగు, సెప్టెంబరు 23: మండలంలోని ఆయా పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. సోమవారం మండలంలోని కోసాయి, దేగామ, ఉమ్రి, కప్పరి దేవి తదితర గ్రామాల్లో పర్యటించి ఆయా పాఠశాలల్లో చేపడుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందన్నారు. ఆయా పాఠశాలలో చేపడుతున్న మరుగుదొడ్లు, ప్రహరీ గోడలు, డైనింగ్ కిచెన్, తాగునీటి మరమ్మతులు, తదితర వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. అదే విధంగా పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుధీర్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, త్రయంబక్, పంచాయతీ సెక్రెటరీలు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు : ఎంపీవో

తలమడుగు, సెప్టెంబరు 23: పారిశుధ్య నిర్మూలనపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీవో సుధీర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం మండలంలోని గిరిజన గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపింపంచడం వలన విష జ్వరాలు అంటు వ్యాధులు ప్రభలుతున్నాయన్నారు. రోడ్లపై చెత్తాచెదారం నిల్వ ఉండకుండా ప్రతిరోజు శుభ్రపరచాలన్నారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి గ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందులో ఎంపీడీవో చంద్రశేఖర్, మండల వైద్యాధికారి డాక్టర్ హరీష్, ఉపాధ్యాయుడు నంజీవరెడ్డి, త్రయంబక్, హెచ్ఈవో చిన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీ

ఆదిలాబాద్, సెప్టెంబరు 23: ఆదిలాబాద్‌లోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను బాసర జోన్ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌బాబు సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ మేరకు నిర్వహిస్తున్నారా? లేదా? అనేది పరిశీలించారు. అనంతరం ఆయన పలు రిజిష్టర్లను పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట రాష్ట్ర బృందం సభ్యులు వెంకటరెడ్డి, శ్రీనివాస్, డీఎంహెచ్‌వో కృష్ణ, వైద్యాధికారులు నరేందర్ రాథోడ్, గజానంద్, తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ జాన్‌బాబు

ఖానాపూర్ ఎంజేపీ స్కూల్ నుంచి విద్యార్థి పరార్

● పట్టుకొని పాఠశాలలో అప్పగించిన పోలీసులు ● పదిరోజుల వ్యవధిలో రెండు ఘటనలు ● పాఠశాల పర్యవేక్షణపై తలెత్తుతున్న అనుమానాలు

ఖానాపూర్, సెప్టెంబరు 23 : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాల పర్యవేక్షణపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. పది రోజుల వ్యవధిలోనే ఇద్దరు విద్యార్థులు పాఠశాల నుంచి పరార్ కావడం తీవ్ర కలకలం రేపుతోంది. గత పది రోజుల క్రితం పాఠశాలకు చెందిన ఓ విద్యార్థి పాఠశాల నుంచి పరారైన విషయం మరవకముందే ఆదివారం రాత్రి పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న మరో విద్యార్థి పరారయ్యాడు. వివరాల్లోకి వెళ్తే ఖానాపూర్ పోలీసులు తెలిపిన కథనం ప్రకారం... మహాత్మాజ్యోతి బాపూలే బాలుర పాఠశాలలో ఐదవతరగతి చదువుతున్న కడెం మండలం కొండూరు గ్రామానికి చెందిన నిక్షిత్ అనే విద్యార్థి ఇంటిపై బెంగతో రాత్రి సమయంలో హాస్టల్ నుంచి ఎవరికీ తెలియకుండా తప్పించుకొని బయటకు వెళ్లాడు. బయటకు వెళ్లిన విద్యార్థికి ఎటు వెళ్లాలో తెలియక ఏడుస్తూ రోడ్డుపై తిరుగుతుంటే అటుగా వెళ్లిన వ్యక్తి బాలుడిని చూసి 100 డయల్‌కి ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో సమాచారం అందుకున్న బ్లూ కోర్ట్ సిబ్బంది సుధీర్ కుమార్, సంతోష్‌లు బాలుడు ఏడుస్తూ తిరుగుతున్న ప్రాంతానికి వెళ్లారు. అతడిని పిలిచి ఎందుకు ఏడుస్తున్నావని అడగగా హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక ఇంటి మీద బెంగతో ఇంటికి వెళ్లాలని బయటకు వచ్చానని తెలిపినట్లు బ్లూ కోర్ట్ సిబ్బంది పేర్కొన్నారు. దీంతో బాలుడికి ధైర్యం చెప్పి తిరిగి హాస్టల్‌కు తీసుకెళ్లి అప్పగించినట్లు వారు పేర్కొన్నారు. పాఠశాల నుంచి తప్పించుకుని బయటకు వెళ్లి ఏడుస్తూ తిరుగుతున్న బాలుడిని పట్టుకుని అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి తిరిగి హాస్టల్‌లో అప్పగించిన బ్లూ కోర్ట్ సిబ్బంది సుధీర్ కుమార్, సంతోష్‌లను జిల్లా ఎస్పీ జానకీషర్మిల సహా స్థానిక సీఐ సైదారావు అభినందించారు. కాగా వరుసగా విద్యార్థులు పాఠశాల నుంచి పరారవుతుండడంతో పాఠశాల పర్యవేక్షణ ప్రశ్నార్థంగా మారుతుందని పలువురు మండిపడుతున్నారు. పాఠశాలలో రాత్రివేళ విధులు నిర్వహించే ఉపాధ్యాయులు, వాచ్‌మెన్ ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఖానాపూర్ పురవీధుల్లో ఏడుస్తూ తిరుగుతున్న విద్యార్థి నిక్షిత్‌కు ధైర్యం చెప్పి ఓదారుస్తున్న పోలీసులు

ఈ రెండు ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరిపి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్ విశ్వేశ్వర్‌ను వివరణ కోరగా ఆ విద్యార్థికి ఇక్కడ చదవడం ఇష్టం లేకనే పాఠశాల నుంచి పారిపోయాడన్నారు. మరోసారి ఇటువంటి తప్పిదం జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

నాలుగు లేబర్ కోడ్లను నిరసిస్తూ బ్లాక్ డే

● ఆర్డీవో కార్యాలయం ముందు కార్మిక సంఘాల నిరసన



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే. రాజన్న

నిర్మల్, సెప్టెంబరు 23 : కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా మోదీ ప్రభు త్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సోమవారం నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ముందు కార్మిక సంఘాల నాలుగు లేబర్ కోడ్స్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న మాట్లాడుతూ... నరేంద్ర మోదీ బీజే పీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవ త్సరాల కాలం అవుతుంది. ఈ కాలమంతా ఈ దేశంలో ఉన్న పెట్టుబడిదారులైన కార్పొరేట్, బహుళ జాతి సంస్థల ప్రయోజనాల కోసం కార్మిక చట్టాలను సవరణ చేసి 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి పెట్టుబడి దారులకు కార్మికవర్గశ్రమను దోచుకోవానికి అనుకూలంగా నిర్ణయం తీసుకున్నాడన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అసెంబ్లీలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేయబోమని తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు, జిల్లా నాయ కులు గంగాధర్, గంగామణి, విజయలక్ష్మి, లక్ష్మీ, లలిత, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు భూక్యా రమేష్, అనంతరావు దుర్గే, సీఐటీయూ నాయకులు రాజన్న పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు అపూర్వస్పందన

భైంసా, సెప్టెంబరు 23 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణ పరిధిలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియకు అపూర్వ స్పందన లభిస్తోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడ్లూరి శ్రీనివాస్, ముథోల్ నియోజకవర్గ సభ్యత్వ ఇన్‌చార్జీ సుష్మారెడ్డి తెలిపారు. సోమవారం భైంసా పట్టణంలోని 152 పోలింగ్ బూత్ పరిధిలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, భైంసా సభ్యత్వ కన్వీనర్ చొప్పరి వెంకటేశ్, సహ కన్వీనర్ బండారి దిలీప్, కాసర్ల ప్రవీణ్, రాకేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గణపతి శోభాయాత్ర



గణపతి శోభాయాత్రలో పాల్గొన్న ఎస్పీ జానకి షర్మిల, పోలీసు సిబ్బంది

నిర్మల్, సెప్టెంబరు 23 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో 17 రోజులుగా భక్తి శ్రద్ధలతో పూజలందుకున్న లంబోదరుడికి సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. అంతకు ముందు పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్నప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం గణపతి శోభాయాత్ర సాంప్రదాయ పద్ధతిలో మేళతాళాలతో ఎస్పీ పోలీసు క్యాంప్ కార్యాలయం నుంచి బంగల్‌పేట్ చెరువు వద్దకు చేరుకుంది. జిల్లా ఎస్పీ జానకి షర్మిల, డీఎస్పీ గంగారెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, పోలీసుసిబ్బంది పాల్గొని భక్తికీర్తనలతో సాగిన శోభాయాత్ర చూసేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు.

మంచినీటి సరఫరాలో మిషన్ భగీరథ క్షేత్ర సహాయకుల పాత్ర కీలకం

● శిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో డీఎల్‌పీవో రమేష్



మాట్లాడుతున్న మిషన్ భగీరథ డీఈఈ లక్ష్మీనారాయణ

దిలావర్‌పూర్, సెప్టెంబరు 23 : మిషన్ భగీరథ క్షేత్ర సహాయకుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం డీఎల్‌పీవో రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోకి మంచి నీటి సరఫరాలో క్షేత సహాయకుల పాత్ర చాలా కీలకమని డీఎల్‌పీవో రమేష్ అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లోని పైప్‌లైన్ లీకేజీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వెంటనే లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అనంతరం మహిళా స్వయం సహాయక సంఘాల మహిళల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. స్కూల్ పిల్లల యూనిఫామ్ డ్రెస్‌ల స్టిచ్చింగ్‌ను పరిశీలించారు. మహిళలు ప్రభుత్వం ఇచ్చే రుణాలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. ఈ సందర్భంగా పొదుపుపై మహిళా సంఘాలకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం సులోచన రెడ్డి, దిలావర్‌పూర్ ఈవో చంద్రశేఖర్, సీసీలు, స్వయం సేవక సంఘాలు, మహిళలు పాల్గొన్నారు.

తానూర్, సెప్టెంబరు 23 : మిషన్ భగీరథ గ్రామ మంచి నీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభం అయినట్లు మిషన్ భగీరథ డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. దీంట్లో భాగంగా 4రోజుల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, గ్రామంలోని చేతి పంపుల నిర్వాహణ, సింగిల్ ఫేస్, త్రీపేస్ మోటర్ల రిపేర్లు, నీటి నాణ్యత, అవగాహన మీద శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులున్నారు.

హాజరు శాతం పెంచడానికి అధ్యాపకులు ఇంటి బాట

దిలావర్‌పూర్, సెప్టెంబరు 23 : విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు జూనియర్ కళాశాల అధ్యాపకులు విద్యార్థుల ఇంటిబాట పట్టారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొంది కళాశాలకు హాజరు కాని విద్యార్థులను వారి తల్లిదండ్రులను




విద్యార్థి తల్లిదండ్రులతో అధ్యాపకులు

కలిసి కళాశాలకు రావాలని కోరుతున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్ అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి కళాశాలకు వివిధ గ్రామాల నుంచి వచ్చే విద్యార్థుల గ్రామాలను ఆరు క్లస్టర్లుగా విభజించారు. సోమవారం మాడేగాం, కదిలి, కుస్లీ, అంజనీ తండాలకు అధ్యాపకులు రామారావు, నర్సయ్య, జైపాల్, శ్రీనివాస్‌లు కళాశాలకు హాజరు కాని విద్యార్థులను తల్లిదండ్రులను కలిసి మీ పిల్లలను ప్రతి రోజు కళాశాలకు హాజరయ్యే విధంగా చూడాలని కోరారు. విద్యార్థి దశలో ఇంటర్మీడియట్ కీలకం. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిరంతరం కృషి చేయడానికి ప్రణాళికలను రూపొందించామని వివరించారు.

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన నిర్మల్ జిల్లా విద్యార్థి



నిర్మల్ కల్చరల్, సెప్టెంబరు 23 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో అండర్ - 14 జోనల్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మెరుగైన ఆట తీరును కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి అండర్ - 14 బాలికల జట్టులో విజయ హైస్కూల్ విద్యార్థిని సీహెచ్. ప్రతిభ (ఎనిమిదవ తరగతి) రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ మంచిర్యాల నాగభూషణం, ప్రిన్సిపాల్ సామ మోహన్‌రెడ్డి, పీఈటీలు గిరిప్రసాద్, కృష్ణవేణి, ఉపాధ్యాయులు అభినందించారు.








● కోతకు వచ్చిన సోయా పంట

కొనుగోళ్లపై.. సందిగ్ధం

- జిల్లాలో చేతికి వచ్చిన సోయా పంట
- రేపటి నుంచి సోయాల కొనుగోళ్లకు అధికారుల నిర్ణయం
- ఆటంకంగా మారిన వర్షాలు
- వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే.. సోయా పంట కొనుగోళ్లు
- అయోమయానికి గురవుతున్నరైతులు
- జిల్లావ్యాప్తంగా ఈ యేడు మొత్తం 82వేల ఎకరాలలో సాగైన పంట



ఆదిలాబాద్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగయ్యే పంటలలో సోయా పంట ప్రధానంగా కనిపిస్తుంది. పత్తి పంట తర్వాత అధికంగా రైతులు సోయా పంటనే సాగు చేస్తారు. పూర్తిగా వర్షాధార పంటగా పండించే సోయా పంట దిగుబడులు ఈయేడు ఆశాజనకంగానే కనిపిస్తున్నాయి. ఇప్పటికే జిల్లాలో సోయా పంట చేతికి రావడంతో కోతలు కోస్తూ.. పంట నూర్పిడిని ప్రారంభించారు. దీంతో ఈనెల 25వ తేదీ నుంచి సోయాక పంట కొనుగోళ్లను ప్రారంభించేందుకు సంబంధిత శాఖల అధికారులు సిద్ధమయ్యారు. కానీ జిల్లాలో కురుస్తున్న వర్షాలతో కొనుగోళ్లపై ఇంకా సందిగ్ధమే నెలకొంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే రేపటి నుంచి సోయా కొనుగోళ్లను ప్రారంభించే అవకాశం కనిపిస్తుంది. ప్రతియేటా పంట చేతికి వచ్చిన సమయంలోనే వర్షాలు కురవడం.. అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. ఈ యేడు జిల్లావ్యాప్తంగా 82వేల ఎకరాలలో సోయం పంటసాగైంది. దీంతో 5 లక్షలకు పైగా క్వింటాళ్ల సోయా దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎకరాన 6క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్ల వరకు దిగుబడులు వచ్చే అవకాశం ఉందంటున్నారు. అయితే గత పక్షం రోజులుగా పంట చేతికి రావడంతో కోతలను ప్రారంభించారు. జిల్లాలో అడపదడప కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. పంటను నూర్పిడి చేసి ఆరబెట్టేందుకు అవకాశమే లేకుండా పోతోందని అన్నదాతలు పేర్కొంటున్నారు. దీంతో ఉదయం నుంచి రాత్రి వరకు పంట కుప్పల వద్దనే పడిగాపులు కాయల్సి వస్తుంది. గతేడు క్వింటాలుకు రూ.4600 ధర పలికిన సోయా.. ఈయేడు రూ.4892 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. దీంతో అన్నదాతల్లో ఆనందమే కనిపిస్తున్నా.. పంట నాణ్యత దెబ్బతింటే మద్దతుధర దక్కే అవకాశం లేదని రైతులు చెబుతు న్నారు. అంతేకాకుండా కొంతమంది రైతులకే మద్దతు దక్కే అవకాశం ఉందంటున్నారు. అయితే, వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు.

వాతావరణం అనుకూలిస్తేనే..

వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే సోయా కొనుగోళ్లను ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. గత రెండు, మూడు రోజులుగా జిల్లాలో తేలికపాటి వర్షాలు కురవడం, ఆకాశం మేఘావృతమై కనిపించడంతో కొనుగోళ్లపై కొంత సందిగ్ధమే కనిపిస్తోంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేవంటూ అధికారులు కొనుగోళ్లను వాయిదా వేసే అవకాశం ఉంది. రేపటి నుంచి కొనుగోళ్లను చేపట్టాలని ఇప్పటికే అధికారులు నిర్ణయించిన వాతావరణం అనుకూలించే విధంగా కనిపించడం లేదంటున్నారు. కొంత మంది రైతులు పంట నూర్పిడి చేసి అమ్మేసుకునేందుకు సిద్ధంగా ఉంచినా.. సకాలంలో కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభంకాక పోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. కొంతమంది రైతులైతే అత్యవసరాల పేరిట గ్రామాల్లో దళారులకు అమ్మేసుకుంటున్నట్లు తెలుస్తుంది. దసరా పండుగ కూడా దగ్గర పడడంతో ఖర్చుల కోసం ఆదరబాదరగా పంటను అమ్మేసుకునే అవకాశం కనిపిస్తోంది. కొనుగోళ్లపై అధికారులే స్పష్టంగా చెప్పలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. నగదును ఆశ చూపి దళారులు రైతులను మభ్యపెడుతున్నట్లు తెలుస్తుంది. పెట్టుబడి ఖర్చుల కోసం దళారులకు అమ్మేందుకే రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యత, తేమ పేరిట దరల్లో భారీ కోతలు విధిస్తూ దళారులు అందినకాడికి దండుకుంటున్నారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.4892 ఉండగా.. క్వింటాల్ సోయా పంటను రూ.4వేల నుంచి రూ.4500 వరకు కొనుగోలు చేస్తూ దళారులు నిల్వ చేస్తున్నారు. మళ్లీ ప్రభుత్వ కొనుగోళ్ల కేంద్రాలు ప్రారంభం కాగానే మద్దతు ధరకు విక్రయించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నా.. దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసేందుకు మార్కెట్ అధికారులు చర్యలు చేపట్టినట్లు కనిపించడం లేదు.

కోతలకు ఆటంకం

గత పక్షం రోజులుగా సోయా పంట చేతికి వచ్చినా.. కురుస్తున్న వర్షాలతో సోయా పంట కోతలకు ఆటంకంగా మారాయని అన్నదాతలు చెబుతున్నారు. కొన్ని స్వల్పకాలిక వెరైటీలు కోతకు రావడంతో రైతులు పంట నూర్పిడికి ప్రయత్నం చేస్తున్నారు. కానీ నిత్యం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురవడంతో సోయా పంట కోతలు మరింత ఆలస్యమవుతున్నాయి. అసలే నల్లరేగడి నేలలు కావడంతో తేమ శాతం అధికంగా కనిపిస్తోంది. దీంతో నూర్పిడి చేసిన సోయా పంటను ఆరబెట్టేందుకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయ ని చెబుతున్నారు. గ్రామాల సమీపంలోని రోడ్లపై పంటను ఆరబెడుతూ.. వర్షం రాగానే దానిపై టార్పలిన్ కవర్లతో తడిసి పోకుండా జాగ్రత్త పడుతున్నారు. దీంతో నిత్యం రైతులు పంట కుప్పల వద్దనే పడిగాపులు కాస్తున్నారు. కురుస్తున్న వర్షాలు అన్నదాతలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇదే పరిస్థితులు మరికొన్నాళ్ల పాటు ఉంటే చేలలోనే సోయా కాయలు మొలకెత్తే అవకాశం ఉందని చెబుతున్నారు. కురుస్తున్న వర్షాలకు పంట చేలు తడిసి ముద్దవడంతో హార్వెస్టర్ యంత్రాలతో కోతలకు ఇబ్బందిగా మారిందం టున్నారు. ప్రస్తుతం కోతలు కోసిన ఆరబెట్టే అవకాశం లేకపోవడంతో పంట చేలలోనే వది లేస్తున్నారు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పడితేనే సోయా పంట కోతలు ఊపందుకునే అవకాశం ఉందంటున్నారు. అలాగే కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేసే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో ఆశాజనకంగా సోయా పంట

: మేకల శ్రీనివాస్ యాదవ్, రైతు, తలమడుగు మండలం



ఈయేడు వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో సోయా పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. కానీ కురుస్తున్న వర్షాలతో గందరగోళ పరిస్థితులకు దారి తీస్తోంది. సోయా పంట కోతలకు ఆటంకంగా మారడంతో ఎదురుచూడాల్సి వస్తుంది. వర్షాలు తగ్గుముఖం పడితే పంట నూర్పిడి పనులు ఊపందుకుంటాయి. నేల తేమతో ఉండడంతో హార్వెస్టర్ భారీ యంత్రాలతో పంట కోతకు అవకాశం లేకుండా పోయింది. కూలీలతో పంటలు కోసి కుప్పలు వేసినా.. యంత్రాలతోనే నూర్పిడి చేయాల్సి ఉంటుంది. వర్షాల కారణంగా కుప్పలు తడవకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వర్షాలు తగ్గుముఖం పడితే సోయా పంటనూర్పిడి చేసి కొనుగోలు కేంద్రాలకు తరలిస్తాం.

వాతావరణం అనుకూలిస్తే కొనుగోళ్లు ప్రారంభిస్తాం

: ప్రవీణ్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ అధికారి, ఆదిలాబాద్

జిల్లాలో వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తేనే సోయా పంట కొనుగోళ్లను ప్రారంభిస్తాం. ఇప్పటికే ఈనెల 25 నుంచి కొనుగోళ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లను పూర్తి చేశాం. కానీ జిల్లావ్యాప్తంగా వర్షాలు కురవడం, కొనుగోళ్లకు ఆటంకాలు ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. వర్షాలు తగ్గుముఖం పడితే కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేస్తాం. రైతులు ఆదరబాదరగా దళారులకు అమ్మేసుకుని నష్టపోవద్దు. ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలలోనే పంటను అమ్ముకోవాలి.

సంక్షిప్త సమాచారం

27న బంజారాల సమావేశం

ఆదిలాబాద్, సెప్టెంబరు 23: ఈనెల 27న బంజార సమస్యలపై జాతీయ బంజార సేవా సంఘ్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రెడ్డి నాయక్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహించే ఈ సమావేశంలో బంజారాలు ఎదుర్కొంటున్న సమస్యతోపాటు వివిధ డిమాండ్లపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. బంజారాలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బంజార కులస్తులు సురేష్ రాథోడ్ నాయక్, జాదవ్ పవన్ నాయక్, జాదవ్ సుభాష్, చౌహాన్ వినాయక్‌రావ్, ఆడె సురేష్, జాదవ్ సుభాష్ తదితరులున్నారు.

'పాల బిల్లులు చెల్లించాలి'

ఇచ్చోడ, సెప్టెంబరు 23: మండలంలోని పాడి రైతులకు గత మూడు నెలలుగా పాల బిల్లులు చెల్లించడంలేదని పాడి రైతులు సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద ధర్నా నిర్వహించారు. ఇచ్చోడలోని విజయ డెయిరీకి నిత్యం పాలు సరఫరా చేసే పాడి రైతులకు గత 3నెలల నుంచి పాల బిల్లులు ఇవ్వడంలేదని రోడ్డుపై పాలను పారబోసి నిరసన వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. అంతేకాకుండా పాల బిల్లును వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛమైన పాలు అందించే పాడి రైతులకు బిల్లులు చెల్లించకపోవడంతో పశువులకు గ్రాసం తీసుకురాలేక పోతున్నామని పశుపోషణ చాలా ఇబ్బందిగా మారిందని రైతులు వారి ఆవేదనను వ్యక్తం చేశారు. పాడిరైతులకు సకాలంలో బిల్లులు చెందిచాలని వారు పేర్కొన్నారు.

'ప్రభుత్వ పరంగా ఆదుకోవాలి'

బోథ్, సెప్టెంబరు 23: గత ప్రభుత్వ హయాంలో వీఆర్‌ఏలను వివిధ శాఖల్లో భర్తీ చేసి అనంతరం వారి సంక్షేమాన్ని మరిచిపోయిందని రిటైర్డ్ వీఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ వాపోయారు. సోమవారం ఈ విషయమై స్థానిక తహసీల్దార్ సుభాష్ చంద్రబోస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వ పరంగా ఇతర ఉద్యోగులకు ఇచ్చిన విధంగానే ఆర్థిక భరోసా కల్పించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు.

బాబేరతండా పాఠశాలలో ఎంపీడీవో తనిఖీ

బోథ్, సెప్టెంబరు 23: మండలంలోని బాబేరతండా ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంపీడీవో జీవన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అంతేగాక మధ్యాహ్నం భోజనం అమలును పరిశీలించారు. ఉపాధ్యాయులు పాఠశాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూడాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా ● కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 'ప్రజా ఫిర్యాదుల విభాగం' ● పాల్గొన్న ఆయా శాఖల అధికారులు

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 23: ప్రజా ఫిర్యాదుల విభాగంలో వచ్చే అర్జీలను పెండింగ్‌లో లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలపై స్పందిస్తూ అప్పటికప్పుడే అధికారులను పిలిపించి సూచనలు చేశారు.



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న జిల్లా కలెక్టర్

అదే విధంగా ఫోన్‌లో అధికారులతో మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు.ప్రజలు ఇచ్చే ఫిర్యాదుల పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో అర్జీలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో సాయన్న, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● ఉపాధ్యాయులను నియమించాలని వినతి

గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉండడంతో విద్యార్థులకు చదువు సక్రమంగా అందడం లేదని సర్దుబాటులో ఉపాధ్యాయులను నియమించాలని తాంసి మండలం పొన్నారి గ్రామస్థులు ఫిర్యాదుల విభాగానికి వచ్చారు. గ్రామంలో పాఠశాలలో 80మందికి పైగా విద్యార్థులు 1 నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారని మాజీ సర్పంచ్ అశోక్ తెలిపారు. ఒక్కరే ఉపాధ్యాయురాలు ఉండడంతో విద్య అందడం లేదని అన్నారు ఎంఈవోకు విన్నవించినా.. ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉపాధ్యాయులను సర్దుబాటు చేయని పక్షంలో తమ పిల్లలను ప్రైవేట్‌కు పంపించే పరిస్థితి ఉం దన్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ కమిటీ ఛైర్మన్ కవిత, తల్లిదండ్రులు రఘు, శంకర్, నరేష్, తిరుపతి, సాహిర్, సుమలత అనిత, లావణ్య, తదితరులున్నారు.

అందుబాటులో పోలీసు యంత్రాంగం : ఎస్పీ

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 23: బాధిత కుటుంబ సభ్యులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పీ గౌస్‌ఆలం తెలిపారు. 24గంటలు విధులలో ఉంటూ ప్రజా శ్రేయస్సుకు పాటు పడే పోలీసు యంత్రాంగం బాగోగులు, ఇన్సూరెన్స్ విషయాలపై ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ప్రతి ఒక్కరికి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాలో శాలరి ప్యాకేజీ అకౌంట్‌లోకి మార్చడం జరిగిందన్నారు. ప్రమాదవశాత్తు, యాక్సిడెంట్, సాధారణంగా సిబ్బంది మృతి చెందినట్లయితే వెంటనే ఇన్సూరెన్స్ కుటుంబ సభ్యులకు అందించి చేయూతనందించాలనే ఉద్దేశంతో ప్రతీఒక్కరి అకౌంట్ పోలీసు శాలరీ ప్యాకేజీకి మార్చడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా మృతి చెందిన ఆర్‌ఎస్సై జి మారుతి, కె.మార్కండేయా కుటుంబ సభ్యులకు రూ.1లక్షల చొప్పున ఇన్సూరెన్స్ డబ్బులను అందజేశారు. ఇందులో అదనపు ఎస్పీ ఆపరేషన్ సురేంద్రరావు, డీఎస్పీ పోతారం శ్రీనివాస్, సీసీ దుర్గం శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, ఎస్‌బీఐ బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పొన్నారి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

విద్యార్థులు ఉన్నా.. బోధకులు ఏరీ?!

జిల్లా కేంద్రానికి.. కూతవేటు దూరంలో ఉన్న తాంసి మండలం పొన్నారి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. ఐదు తరగతుల్లో 80మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. అయితే, ఇది వరకు ఇక్కడ నలుగురు ఉపాధ్యాయులు పని చేయగా.. గత నెలలో ఇద్దరు ఉద్యోగ విరమణ పొందారు. మరొకరు పదోన్నతిపై ఇతర పాఠశాలకు వెళ్లిపోయారు. ప్రస్తుతం ఒకే ఉపాధ్యాయురాలు ఐదు తరగతులకు బోధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి ఉపాధ్యాయుల ను నియమించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

(- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు

జైనూర్ ఘటనపై ముఖ్యమంత్రికి నివేదిక

ఉట్నూర్, సెప్టెంబరు 23: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జైనూర్‌లో చోటు చేసుకున్న శాంతి భద్రతల సమస్యపై గత రెండు రోజులుగా ఉట్నూర్‌లో ఆదివాసీ కుల పెద్దలతో, అధికారులతో నిర్వహించిన సమావేశాల నివేదికను సీఎం రేవంత్‌రెడ్డికి సోమవారం రాత్రి సమర్పించామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. సోమవారం రాత్రి హైదరాబాద్ నుంచి ఆయన ఫోన్లో మాట్లాడుతూ జైనూర్ ఘటనపై పూర్తి అంశాలను సీఎంకు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఆధ్వర్యంలో వివరించామని ఎమ్మెల్యే తెలిపారు.

17న జోడేఘాట్‌లో కొమురంభీం వర్ధంతి

ఉట్నూర్, సెప్టెంబరు 23: ఆదివాసీల ఆరాధ్యదైవం జల్‌జంగల్ జమీన్ కోసం పోరాడి అమరుడైన పులిబిడ్డ కొమురంభీం 84వ వర్ధంతి సభ అక్టోబరు 17న ఉమ్మడి జిల్లాలోని కెరమెరి మండలం జోడేఘాట్‌లో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని కొమురంభీం మనువడు కొమురం సోనేరావు ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏకి వచ్చిన కొమురంభీం మనువడు కుమరం సోనేరావు ఆదివాసీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి జోడేఘాట్‌లో నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో రాంజీగోండు ఆశయ సాధన సమితి అధ్యక్షుడు మరుసుకోల తిరుపతి, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, జేఏసీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆడ హనుమంతరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ జీవితం స్ఫూర్తిదాయకం

ఇంద్రవెల్లి, సెప్టెంబరు 23: బలహీన వర్గాల కోసం అన్ని రకాల హక్కులను కల్పించిన ఘనత అంబేద్కర్‌కు దక్కుతుందని అంబేద్కర్ జీవితంపై ప్రతీ ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పూజ్య భంతేజీవక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మిలింద్‌నగర్ కాలనీలోని త్రిరత్న బుద్ధ విహార్ ఆవరణలో భీం సంకల్ప దివాస్ (అంబేద్కర్ జీవితాన్ని మార్చిన రోజు) ఘనంగా నిర్వహించారు. ఇందులో మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి వాగ్మారే కామరాజ్, నాయకులు మోరే దిలిప్, మాస్కే రాజవర్ధన్, తదితరులున్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న పీవో ఖుష్బుగుప్తా

గిరిజనుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు : పీవో

ఉట్నూర్, సెప్టెంబరు 23: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ చాంబర్‌లో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను పీఓ ఖుష్బుగుప్తా స్వీకరించారు. కాగా, పింఛన్లు, రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఇందులో ఏపీవో జనరల్ జాదవ్ వసంతరావు, ఏజెన్సీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కుడిమెత మనోహర్, పరిపాలన అధికారి దామోదర స్వామి, పీహెచ్‌వో సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, డీపీవో ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

● బి గ్రేడ్ సాధించిన టీటీడబ్ల్యూఆర్ మహిళ డిగ్రీ కళాశాల

ఉట్నూర్: తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళ గురుకుల డిగ్రీ కళాశాలకు బి గ్రేడ్ లభించడం పట్ల ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అభినందనలు తెలిపారు. తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (మహిళ), ఉట్నూర్ మొదటి నాక్ పీర్ టీమ్ సందర్శనలో బి ప్లస్ గ్రేడ్ సాధించిందని, ఆదిలాబాద్‌కు ఇది ఓ మైలు రాయని పీవో అన్నారు.

భీంపూర్ తహసీల్దార్‌గా నలందప్రియ

భీంపూర్ రూరల్, సెప్టెంబరు 23: భీంపూర్ నూతన తహసీల్దార్‌గా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన నలందప్రియ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడే తహసీల్దార్‌గా పని చేసిన సత్యనారాయణరావు ఇచ్చోడకు బదిలీ కాగా.. వారిని తహసీల్దార్ సిబ్బంది నాయకులు శాలువాతో సన్మానించారు. ఇందులో డీటీ హరిదాస్, సీనియర్ అసిస్టెంట్ నర్సింలు, ఆర్ఐ పంద్రే రామ్‌దాస్, జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్, రికార్డు అసిస్టెంట్ పులి స్వామి, తాటిపెల్లి రాజు, దాసరి రమేష్, కల్లెం శ్రీనివాస్‌రెడ్డి, రేణికుంట్ల శ్రీనివాస్, షేక్ అఫ్రోజ్, రామేశ్వర్‌లు పాల్గొన్నారు.